

ఇది కదా **అభివృద్ధి**

సంక్షేమం.. అభివృద్ధికి చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నిలుస్తోంది. ప్రజల కనీస అవసరాలు తీర్చేలా అభివృద్ధి పనులు చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా మోక్షం లభించని సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సామాజిక భవనాల నిర్వహణను గాలికొది లేశారు. ఫలితంగా ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు చేసుకోవడానికి అవస్థలు పడేవారు. వీధులు, ప్రైవేటు కల్యాణ మండపాలను ఆశ్రయించేవారు. అయితే ప్రజల సమస్యలు తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవసరమైన చోట సామాజిక భవనాలు నిర్మించింది. శిథిలమైన వాటిని ఆధునీకరించి అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఆయా ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

చక్కని వేదిక

ఆధునిక హంగులతో సామాజిక భవనాల నిర్మాణం ■ ప్రజల హర్షాతిరేకాలు



58వ వార్డు ములగాడలో నిర్మించిన భవనం



గాంధీజీవీధి వద్ద నిర్మించిన నూతన సామాజిక భవనం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో లక్షలాది రూపాయిలతో నూతన హంగులతో సామాజిక భవనాల నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు తమ ప్రాంతానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు తమ ప్రాంతాల్లో సామాజిక భవనాలు కావాలని కోరిన వెంటనే వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు సామాజిక భవనాలు నిర్మించాలని వినతులు అందించారు. చేసేస్తామని హామీ ఇవ్వడమే తప్ప కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటికి మోక్షం లభించింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరి సామాజిక భవనాలు అందుబాటులోకి వచ్చాయి.

సకల సదుపాయాలతో..

జగనన్న ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆనంద్‌కుమార్ స్థానికుల ఆశలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు సామాజిక భవనాల నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరు చేసి పూర్తి చేశారు. స్థానిక యువత, మహిళలు, కుల సంఘాలు తమ సమావేశాలను నిర్వహించుకోవడమే కాకుండా ఆయా ప్రాంతాల ప్రజలు శుభకార్యక్రమాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు.

చెప్పిన వెంటనే భవనం నిర్మించారు



మా ప్రాంతంలో ఆడారి ఆనంద్‌కుమార్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చారు.గాంధీజీవీధిలో సామాజిక భవనం కావాలని స్థానిక మహిళలతో కలిసి వివరించాం. ఆయన వెంటనే స్పందించారు. రెండు నెలల వ్యవధిలో వసతులతో కూడిన భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

-బాలు, గాంధీజీవీధి.

హామీ నెరవేర్చారు



మా ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ సురేష్‌తో కలిసి ఆడారి ఆనంద్‌కుమార్ వచ్చారు. ఆ సమయంలో మా ప్రాంతంలో సామాజిక భవనం ఆవశ్యకతను వివరించాం. ఆ మరుసటి నెలలో రూ. 20 లక్షలతో భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇచ్చిన మాటపై నిలబడే నాయకులు ఉండడం గర్వంగా ఉంది.

-సమ్మిడి పైడిరాజు, శ్రీహరిపురం

పలు వార్డుల్లో నిర్మించిన, ఆధునీకీకరించిన సామాజిక భవనాల వివరాలు

వార్డు	ప్రాంతం	నిధులు
58	ఉప్పరకాలనీ	రూ 19.80 లక్షలు
	ములగాడ	రూ.16 లక్షలు
	చిన్న ములగాడ	రూ. 15 లక్షలు
	ములగాడ ఎస్సీ కాలనీ	రూ. 10 లక్షలు
	గుల్లలపాలెం	రూ.16 లక్షలు
60	వుడాకాలనీ	రూ 6.7లక్షలు
	హనుమాన్‌సంజీవ్‌కాలనీలో	రూ.30 లక్షలు
	ఇందిరాకాలనీ	రూ. 35లక్షలు
61	ప్రియదర్శినికాలనీ	రూ 9.30 లక్షలు
	మల్కాపురం	రూ 48.60 లక్షలు
	గాంధీజీవీధి	రూ. 10 లక్షలు
62	గుడివాడ అప్పన్నకాలనీ	రూ 6.2 లక్షలు
	ఏఎస్ఆర్‌కాలనీ	రూ. 20 లక్షలు

సంతోషంగా ఉంది



మా వీధిలో శుభ కార్యాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకోవడానికి వేదికలు లేక ఇబ్బందులు పడేవాళ్లం. పేద వారు వర్షం వచ్చినా.. ఎండైనా రోడ్లపైనే కార్యక్రమాలు నిర్వహించుకునేవారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తేవి. మరి కొంత మంది డబ్బులు చెల్లించి ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు వెళ్లేవారు. ఇప్పుడు సామాజిక భవనం నిర్మించడంతో మా కష్టాలు తీరాయి. చాలా సంతోషంగా ఉంది.

- పవన్‌యాదవ్, మల్కాపురం

సౌకర్యాల కల్పనకు పెద్దపీట



నియోజకవర్గ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు.. అవసరాలు తీరుస్తున్నాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెళ్లినపుడు ఆయా ప్రాంత ప్రజలు తమకు సామాజిక భవనాలు కావాలని కోరారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి సామాజిక భవనాలు నిర్మించాం. -ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరికలు



89వ వార్డు సంతోష్‌నగర్ యువతకు కండువాలు వేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం సంతోష్ నగర్‌కు చెందిన పలువురు యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, నాయకులు గవర నాయుడు, కృష్ణారావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైవే పై హెచ్చరిక బోర్డుల ఏర్పాటు




ఎన్ఏడీ కూడలిలో ఏర్పాటు చేసిన బోర్డు

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలిలో ప్రమాదాల నియంత్రణపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. హైవే పై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా హైవేపై ప్రధాన కూడళ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మధ్య మార్గంలో కేవలం బస్సులు, భారీ వాహనాలు ప్రయాణించేలా, ఇరువైపులా ఉన్న రహదారుల్లో ఇతర వాహనాలు వెళ్లేలా సూచికలతో బోర్డులు పెట్టారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు సిబ్బందిని అప్రమత్తం చేసి, వాహనదారుల్లో అవగాహన కలిగేలా చర్యలు చేపట్టారు.

17న రక్తదాన శిబిరం

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్ వద్ద ఈ నెల 17న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు ఎల్లేటి మమత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న రక్తదాతలు 9701184241 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న కాశీ విశ్వనాథరాజు

విశాఖ విద్య: కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు చాకలిగడ్డ ప్రాంతంలో లబ్ధిదారులకు బుధవారం ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, నాని, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం పగల్‌పత్తు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి లను విశేషంగా అలంకరించి పల్లకీలో అదిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో ఉదయం తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తుల చెంతన దివ్యప్రబంధపారాయణాలు అర్చకులు పఠించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి స్వామిని దర్శించుకున్నారు.

నవ్యాంధ్ర ప్రగతికి జగనే కావాలి

జేసీఎస్ మండల అధ్యక్షుడు బెహరా



చింతల్లోవలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బద్రీనాథ్



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: నవ్యాంధ్ర ప్రగతికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు, జేసీఎస్ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు 483 సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన అంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల వివరాల బోర్డుతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో పాటు పారిశ్రామిక రంగంలో ముందంజలో ఉందన్నారు. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎన్నుకోవాలని కోరారు. బాబు, పవన్ వస్తే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసేసి ఆ పార్టీల కార్యకర్తలను జనం మీదకు వదులుతారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ అండగా నిలుస్తున్నారని.. ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. సచివాలయం పరిధిలో వివిధ పథకాల కింద రూ.19.10కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివారావు, గేదెల మురళీకృష్ణ, సీవో ఝాన్సీ, నాయకులు బండి దుర్గేశ్, టి. రమేష్, వైట్ రాజు, ఊటపల్లి గోవిందు, గంగరాజు, శ్రీను, ఎం. రత్నం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

సింధియా: నిరంతరం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే రాష్ట్ర ప్రజలు మళ్లీ సీఎం చేయాలనుకుంటున్నారని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ సచివాలయం-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బద్రీనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండా ఎగురవేసి, సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ పెంటారావు, బోని ఈశ్వరరావు, అదపాక అప్పారావు, ఉంకిలి చంద్రశేఖర్, బెల



హాజరైన మహిళలు, కార్యకర్తలు



పార్టీ జెండాను ఎగురవేస్తున్న అంగ రామ్‌ప్రసాద్, రేవళ్ల సత్యనారాయణ

గాపు సంజీవ్, ముక్కిడిబిల్లి అప్పారావు, నారాయణమూర్తి, కనకరాజు, వార్డు వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

59వ వార్డులో ..

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం సచివాలయం పరిధిలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.క్లస్టర్-2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, 58,59,60వ వార్డుల పరిశీలకుడు పిల్ల కన్నబాబుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పలువురు నాలుగున్నరేళ్లగా ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద పుర్రె అప్పారావుయాదవ్, నాయకులు రమణ,బంగారు రాజు,సచివాలయాల కన్వీనర్లు దేవర రమేష్,వెంకటలక్ష్మి,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



అశోక్‌నగర్ గౌరీదేవి మందిరం నీటి తొట్టెల్లో దీపాలు విడిచిపెడుతున్న భక్తులు



నందమూరినగర్‌లో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు భాస్కరరావు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పోలిపాడ్యమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేకువ జామున 4 గంటల నుంచి దీపాలు విడిచి పెట్టారు. మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో అరటి దవ్వపై నెయ్యితో చేసిన ఒత్తులు వెలిగించి నీటి తొట్టెల్లో ఆ దీపాలు విడిచి పెట్టి పూజలు చేశారు. 60వ వార్డు అశోక్‌నగర్ గౌరీదేవి ఆలయం వద్ద,ప్రకాష్‌నగర్ గౌరీపరమేశ్వర్లు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక నీటి తొట్టెల్లో ఆయా ప్రాంతాల భక్తులు దీపాలు వదిలారు.

అన్నసమారాధన

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లోని ప్రథమ ఉమా విశ్వేశ్వర కుమారస్వామి ఆలయ ప్రాంగణంలో పోలిపాడ్యమి సందర్భంగా బుధవారం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. పంచామృతాలతో స్వామికి అభిషేకం జరిపించారు. కార్తీక మాసం నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు దీపాలను వెలిగించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనను జియ్యాని మారుతి ప్రారంభించారు.



భక్తులకు భోజనం వడ్డిస్తున్న మారుతి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

13 ఆటోలపై కేసులు

గోపాలపట్నం: మద్దిలపాలెం, ఎన్ఏడీ ప్రాంతాల్లో బుధవారం రవాణా శాఖ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 13 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఈ నెల 11 నుంచి చేపట్టిన తనిఖీల్లో 36 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు, విద్యార్థులను ఎక్కించవద్దని సూచించారు. తనిఖీల్లో అధికారులు రాజారావు, గణేష్ రెడ్డి, మాధవి, ఎస్.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ఎన్ఏడీలో ప్రత్యేక తనిఖీలు

రహదారి భద్రత నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎన్ఎస్టీఎల్ నుంచి వంటిల్లు వైపునకు రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలు, ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై వెళ్లే వాహనాలను తనిఖీ చేసి.. 38 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనచోదకులకు అవగాహన కల్పించారు. భారీ వాహనాలు మాత్రమే ఫ్లైఓవర్‌పై వెళ్లాలని డీటీసీ సూచించారు. అధికారులు రామ్‌కుమార్, సుధీర్, ఏఎస్ ప్రకాష్‌రావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

చురుగ్గా అండర్ పాత్‌వే పనులు



చంద్రనగర్ వద్ద చురుగ్గా జరుగుతున్న పనులు



యంత్రాలతో గోతులు తవ్వుతున్న దృశ్యం

గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న అండర్ పాత్‌వే పనులు రెండు రోజుల క్రితం మొదలయ్యాయి. భారీ యంత్రాలు, క్రేన్లతో ఈ పనులు రైల్వే అధికారులు చేపడుతున్నారు. పనుల నిమిత్తం ఇక్కడి రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న పాకల్ని తొలగింపజేశారు. మరో వారం, పది రోజుల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులు పూర్తయితే కొత్తపాలెం, చంద్రనగర్, నరవ వెళ్లే వారికి సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సైనిక్ స్కూల్ పరీక్షపై మోడల్ టెస్ట్

విశాఖ విద్య: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు అవగాహన కల్పించేలా మోడల్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ప్రైవేటు స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ బి. విజయ్‌కుమార్ బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉదయం 10గంటలకు అక్కయ్యపాలెం వైట్ ఫీల్డ్ స్కూల్ ప్రాంగణంలో మోడల్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9948841652 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

21 నుంచి క్రీడా సంబరం

- ఒక్కో వార్డు నుంచి 4 జట్ల ఎంపిక
- 56 జట్లు.. 96 మ్యాచ్‌లు.. 32 రోజుల సంబరం
- రంజీ టీమ్ సభ్యుల పర్యవేక్షణ
- దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 16 ఆఖరు తేదీ
- ఈ నెల 21న ప్రారంభం.. జనవరి 7న ఫైనల్



క్రికెట్ లీగ్ పోటీల ప్రణాళికను పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు (ఫైల్)

గోపాలపట్నం : పశ్చిమంలో క్రీడా సంబరాలకు సన్నాహాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో క్రికెట్ పోటీలకు సిద్ధమవుతున్నారు. పశ్చిమ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వార్డు నుంచి 4 టీములు సెలక్ట్ చేస్తున్నామని ఆనంద్‌కుమార్ తెలిపారు. 14 వార్డుల నుంచి 56 జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తంగా 96 మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఫైనల్ మ్యాచ్ జనవరి 7న జింక్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామన్నారు. ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లు ఏ విధంగా జరుగుతాయో అదే విధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 16 నుంచి 30 ఏళ్ల వయసు వారు పాల్గొనవచ్చని తెలిపారు. దీని వల్ల ఎక్కువ మందికి అవకాశం కలుగుతుందని తెలిపారు. సాఫ్ట్ టెన్నిస్ బాల్‌తో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆంధ్రా రంజీ ఆటగాళ్లను రప్పించి వారి చేత ఈ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి టీమ్‌ను గుర్తించి ప్రతిభ కనబరిచిన జట్లకు మంచి బహుమతులు అందిస్తామన్నారు.

నియమ నిబంధనలు పాటించాల్సిందే..

- ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి
- ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు దాఖలు చేయాలి
- టీమ్ ఆటగాళ్లు వారి తల్లిదండ్రుల వద్ద నుంచి డిక్లరేషన్ తీసుకురావాలి
- ఏ వార్డుకు సంబంధించిన వారు ఆ వార్డు జట్లలో ఆడాలి. వేరే వార్డు జట్లతో కలిసి ఆడకూడదు.
- ఆర్గనైజింగ్ కమిటీకి ప్రతి టీమ్ 15 మంది సభ్యుల జాబితా టోర్నమెంట్‌కు ముందు సమర్పించాలి. వారు తప్ప ఇతరులు ఆడటానికి అనుమతించరు.
- టాస్‌కు ముందు అంపైర్‌కు సమర్పించిన జాబితా లో 11 మంది సభ్యులు ఆడవచ్చు. మిగిలిన టీమ్ సభ్యుల్ని ఫీల్డింగ్‌లో వాడుకునే వెసులుబాటు ఉంటుంది.
- నిర్వాహకులు ఇచ్చిన జెర్సీలు లేకుండా ఆడేందుకు అనుమతించబడదు. (జెర్సీకి సంబంధించి సమస్య ఉంటే టాస్‌కు ముందే ఎంపైర్ దృష్టికి తీసుకువెళ్లాలి.
- అంపైర్ నిర్ణయమే ఫైనల్. దీనిపై వాదనలు చేయరాదు. అలా చేస్తే పరుగుల పెనాల్టీ విధించబడుతుంది.
- క్వాలిఫై మ్యాచ్‌ల్లో టై అయితే సూపర్ ఓవర్ ఉంటుంది. ఇందులో కూడా టై అయితే మరో సూపర్ ఓవర్‌లో ఆడాలి. ఇందులో కూడా టై అయితే టాస్ ద్వారా విజేతల్ని నిర్ణయిస్తారు.
- వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోతే ఇరుజట్లకు సమానంగా పాయింట్లు కేటాయిస్తారు.
- అంపైర్‌తో చర్చించే అధికారం జట్టు కెప్టెన్‌కు మాత్రమే ఉంటుంది.
- 12 ఓవర్ల మ్యాచ్‌లో ఇద్దరు బౌలర్లు గరిష్టంగా 3 ఓవర్లు వేయాలి.
- 15 ఓవర్ల మ్యాచ్‌లో ఐదు మంది బౌలర్లు గరిష్టంగా 3 ఓవర్లు వేయాలి
- నోబాల్‌కు ఫ్రీ హిట్ ఉంటుంది.
- ఒక ఓవర్‌లో కేవలం రెండు బౌన్సర్లు మాత్రమే వేయాలి.
- మైదానంలో ఆటగాళ్ల ప్రవర్తనకు టీమ్ కెప్టెనే బాధ్యత వహించాల్సి ఉంటుంది.



మ్యాచ్ టైమింగ్స్..

రోజుకు మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. ఉదయం 8.45 గంటలకు టాస్ వేస్తారు. మొదటి ఇన్నింగ్స్ 9.00 నుంచి 9.45 గంటల వరకు ఉంటుంది. రెండో ఇన్నింగ్స్ 9.55 నుంచి 10.40 వరకు జరుగుతుంది. రెండో మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్ 11 గంటలకు మొదలై 11.45కి ముగుస్తుంది. రెండో ఇన్నింగ్స్ 11.55 గంటలకు మొదలై 12.40కి పూర్తవుతుంది. మూడో మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్ 1.40 నుంచి 2.25కి ముగుస్తుంది. రెండో ఇన్నింగ్స్ 2.35 నుంచి 3.20కి పూర్తవుతుంది. ఈ నిబంధనలు అందరూ పాటించాలని, క్రమశిక్షణతో పాల్గొని ప్రతిభను ప్రదర్శించాలని నిర్వాహకులు కోరారు.

దరఖాస్తుకు ఆఖరు తేదీ 16..

క్రికెట్ ఆటలో పాల్గొనేందుకు 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆటగాళ్ల ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు.